ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 34.0 | కనిష్ఠం : 19.0

ANDHRAJYOTHY

5



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

ఆదివారం 16 ఫిబ్రవరి 2025

వివిధ రకాల చిరు ధాన్యాలు





ఆరోగ్యసిరి

సండే స్పెషల్ SUNDAY SPECIAL

- హెల్త్‌పై ప్రజల్లో పెరుగుతున్న శ్రద్ధ
- పెరిగిన సిరిధాన్యాల వాడకం
- మహబూబ్‌నగర్ పట్టణంలో అధికంగా వినియోగం
- ఆర్గానిక్, సిరి ధాన్యాలతో చేసిన టిఫిన్స్ చేసేందుకు మొగ్గు



మహబూబ్‌నగర్‌లోని ఓ టిఫిన్ సెంటర్‌లో విక్రయానికి ఉంచిన రాగి ఉప్మ, సామల కర్డ్ రైస్, కొర్ర పొంగల్

పాలమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉదయం లేచింది మొదలు ఉరుకులు పరుగుల జీవితం.. రోజురోజుకు మారుతున్న జీవనశైలి వెరసి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సిరిధాన్యాల వాడకంపై మక్కువ చూపుతున్నారు. కొర్రలు, అండుకొర్రలు, అర్కలు, ఊదలు, సామలు, రాగులు, జొన్నలు, సజ్జలను ఆహారంలో భాగంగా తీసుకుంటున్నారు. అనారోగ్యం బారిన పడి మందుబిళ్లలు వాడే బదులు ముందు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని భావిస్తున్నారు. అందుకు సిరిధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలే ఏకైక మార్గమని అంటున్నారు. ప్రజల అభిరుచి మేరకు పాలమూరు పట్టణంలో సిరిధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. పట్టణంలోని వివిధ కూడళ్లలో స్టాల్స్ ఏర్పాటు చేసి, వాటిని అమ్ముతున్నారు. అనేక మంది అన్నానికి బదులుగా రొట్టెలు, రాగి జావ తీసుకోవడంతో పాటు సిరిధాన్యాల వాడకాన్ని బట్టి చూస్తే.. ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిందని తెలుస్తోంది.

సిరిధాన్యాల అడ్డా.. పాలమూరు పట్టణం

పాలమూరు పట్టణంలో సిరి ధాన్యాల వినియోగం బాగా పెరిగింది. రోజూ ఉదయం పద్మావతి కాలనీలో ఆరోగ్యదోశ సెంటర్‌లో సిరి ధాన్యాలతో తయారు చేసే టిఫిన్స్ అందుబాటులో ఉంటున్నాయి. ఉదయం వాకింగ్, వ్యాయామం, ఆటలు ఆడేందుకు మైదానాలకు వచ్చే వారంతా ఇక్కడికి ఆ టిఫిన్స్ చేయడానికి వస్తుంటారు. ఆర్గానిక్, సిరిధాన్యాలతో చేసిన పదార్థాలను తినేందుకు ఇష్టపడుతున్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పోషక విలువలు ధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల ఫుడ్స్, ధాన్యాలు ఈ పద్మావతి కాలనీలో లభిస్తున్నాయి. పట్టణంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ధాన్యాలు, కూరగాయల వినియోగం కూడా పెరిగింది.

మితాహారం వైపు మొగ్గు

35 ఏళ్ల వయసు నుంచే బీపీ, షుగర్ తదితర రకాల వ్యాధులు వస్తుండటంతో ప్రజలు తమ ఆహార అలవాట్లను మార్చుకుంటున్నారు. మధ్యాహ్నం మాత్రమే మితంగా అన్నం తిని, ఉదయం, రాత్రి కొర్రలు, అండుకొర్రలు, అరికెలు, ఊదలు, సామలు, రాగులు, జొన్నలు సిరి ధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకుంటున్నారు.



మిల్లెట్ దోశ, రాగి ఇడ్లీ

సిరి ధాన్యాల ధరలు కిలోకు ఇలా.. (రూ.లో..)	
కొర్రలు	90
అందు కొర్రలు	190
సామలు	120
అరికలు	120
ఊదలు	130

అందుబాటులో ధరలు

సిరిధాన్యాలతో చేసిన టిఫిన్స్ రాగిఉప్మ, కొర్ర పొంగల్, సామల కర్డ్‌రైస్, కొర్ర దోశ, అర్కల బిసిబిల్లాబాత్, అంటు కొర్రల దోశ, కొర్రఇడ్లి, రాగి దోశ, రాగి పూరి లభిస్తున్నాయి. వీటి ధరలు రూ.50 నుంచి రూ.90 వరకు ఉంటున్నాయి. పద్మావతి కాలనీ కరెంటు ఆఫీసు ఎదురుగా ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద రోజూ సుమారు 300 మంది వరకు వివిధ రకాల మిల్లెట్స్‌తో చేసిన టిఫిన్స్ తింటున్నారు. పట్టణంలో ఇంకా చాలా చోట్ల ఆర్గానిక్ టిఫిన్స్ లభిస్తున్నాయి.

500 ఎకరాల్లో ఆర్గానిక్ పంటలు

మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 500 ఎకరాల్లో ఆర్గానిక్ పద్ధతిలో వివిధ రకాల పంటలు, కూరగాయలను పండిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. 150 మంది రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి, వ్యవసాయం చేస్తున్నారు. అంతా కలిసి పండించిన వాటిని మార్కెట్ చేసుకోవటం, ఆదాయం పొందటం, మెళకువలను తెలుసుకోవటం, కొత్త పంటలను వేయడం వంటివి చేస్తున్నారు.





రాగి అంబలి, మిల్లెట్ పొంగల్

ప్రజల అభిరుచి మేరకే సిరిధాన్యాలతో టిఫిన్స్



ప్రజలకు ఆరోగ్యంపై ఆసక్తి పెరిగింది. సిరిధాన్యాలతో చేసిన వంటకాలు ఉన్నాయా అని అడుగుతున్నారు. వారికి ఇష్టమైనవి చేసిపెట్టాలనే సిరిధాన్యాలతో తయారు చేసిన టిఫిన్స్ అందిస్తున్నాం. అరిటాకులో టిఫిన్ చేయటానికి అధిక శాతం ప్రజలు ఇష్టపడుతున్నారు. మేం వివిధ రకాల టిఫిన్స్ అందిస్తున్నాం.

- ఆనంద్, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు

క్యాన్సర్‌ను జయించినం



నా భార్యకు క్యాన్సర్ సోకడంతో ఆపరేషన్ చేయించా. పూర్తిగా తగ్గడానికి సిరిధాన్యాలు, పూర్తిగా ఆర్గానిక్ ఆహారం(పురుగు మందులు వాడకుండా పండించిన వాటితో చేసినవి)న్ని వాడమని తెలిసినవారు చెప్పారు. దాంతో అలాంటి ఆహారం పెట్టాం. దాంతో క్యాన్సర్‌ను పూర్తిగా జయించినం. ఖర్చు డబుల్ అయినా.. మా కూతురు పెళ్లిలో పూర్తిగా ఆర్గానిక్ ఆహారమే అందరికి పెట్టినం. ఇప్పటికీ దేవాలయాల దగ్గర అన్నదానం చేసినా ఆర్గానిక్ ధాన్యాలతోనే పెడుతున్నం.

- రాజనరసింహం, పాలమూరు

ఆరోగ్య సమాజమే లక్ష్యం



అందరికి సహజ సిద్ధంగా లభించే ఆహారం అందించటంలో సహాయం చేయాలన్నదే లక్ష్యం. దానికోసమే ఇప్పటికి 9 ఎద్దు గానుగ నూనె మరలను నడుపుతున్నా. రోటీ, బియ్యం నుంచి పప్పుల వరకు రాష్ట్రం, ఇతర చోట్ల పండించే ఆహార పదార్థాలను ప్రజలకు అందిస్తున్నా. అందులోనే తృప్తి ఉంది.

- బస్వరాజు, ఖాదర్‌వలీ శిష్యుడు

మిల్లెట్స్‌తో రైతుకు ఆదాయం



సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు రైతులకు ఆదాయం లభిస్తుంది. సిరి ధాన్యాలు పండించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే రైతులు పండించేందుకు ముందుకొస్తారు. తక్కువ నీరు, తక్కువ ఖర్చుతో వీటిని సాగు చేయొచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లో వీటికి డిమాండ్ ఎక్కువ ఉంది. పంట పండించే దగ్గరి నుంచి మార్కెటింగ్, గిట్టుబాటు ధర లభించే వరకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలి. సహజ సిద్ధమైన ఆహారంతో ఆరోగ్య సమాజం నిర్మాణమవుతుంది.

- బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి

తాత్కాలిక ఉపశమనం



క్లాక్ టవర్ చౌరస్తాలో మూతపడిన దుకాణాలు

- అద్దె దుకాణాల బకాయిలో ఐదు శాతం చెల్లిస్తే షాప్‌లు ఓపెన్ చేస్తామన్న అధికారులు
- తర్వాత వెళ్లి రూ.ఐదు లక్షలు చెల్లించాలని డిమాండ్
- ఐదు లక్షలా? ఐదు శాతమా? అధికారులు, వ్యాపారుల మధ్య దోబూచులాట
- ఎమ్మెల్యేను ఆశ్రయించిన వ్యాపారులు.. ఐదు శాతం చెల్లింపునకు అంగీకారం
- మార్చి 31 వరకు పూర్తిగా చెల్లించాలంటున్న అధికారులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పాలమూరు కార్పొరేషన్ పరిధిలో అద్దె దుకాణాల లెక్క తేలడం లేదు. అద్దె తగ్గించాలని వ్యాపారులు కొన్నేళ్లుగా పైరవీలు చేస్తుండగా, వారికి తాత్కాలిక ఉపశమనం లభించింది. బకాయిలో 25 శాతం చెల్లిస్తేనే దుకాణాల తాళాలు ఇస్తామని చెప్పిన అధికారులు ఎమ్మెల్యే సూచన మేరకు ఐదు శాతం చెల్లిస్తే తాళాలు ఇచ్చేందుకు అంగీకరించారు. అద్దెబకాయిలు ఏకంగా రూ.21 కోట్లకు చేరడంతో అధికారులు వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. చివరకు గడియారం చౌరస్తాతోపాటు మార్కెట్‌లో రోడ్‌లో పది రోజుల క్రితం దుకాణాలను సీజ్ చేశారు. మొదటిసారిగా పది రోజుల పాటు దుకాణాలు మూతపడటంతో గడియారం చౌరస్తాలో కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. బకాయిలో 25 శాతం చెల్లిస్తేనే దుకాణాల తాళాలు ఇస్తామని నగరపాలక సంస్థ అధికారులు తేల్చి చెప్పడంతో మళ్లీ వ్యాపారులు నాయకులను ఆశ్రయించారు. చివరకు ఐదు శాతమైనా చెల్లించాలని అధికారులు పట్టుబడుతుండగా అంత మొత్తం కూడా చెల్లించలేమని వ్యాపారులు వాపోతున్నారు. చివరకు ఎమ్మెల్యే వద్దకు పంచాయతీ చేరింది. వ్యాపారులతో మాట్లాడిన ఆయన ఐదు శాతం చెల్లించి, బకాయిలను సెటిల్ చేసుకోవాల్సిందిగా సూచించారు. అధికారులకు ఇదే విషయం చెప్పడంతో శుక్రవారం ఉదయం దుకాణాలు మూత పడిన పలువురు వ్యాపారులు అద్దె బకాయి మొత్తంలో ఐదు శాతం చెక్కుల రూపంలో ఇచ్చి, తాళాలు తీసుకుని దుకాణాలను తెరుచుకున్నారు. తీరా సాయంత్రం అధికారులు దుకాణాల వద్దకు వెళ్లి రూ.5 లక్షలు చెల్లించాల్సిందేనని, ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయని దుకాణాలను మూయించడంతో వ్యాపారులు కంగుతినాల్సి వచ్చింది. నలుగురు మెడికల్ దుకాణాల వ్యాపారులు మాత్రం రూ.ఐదు లక్షలు చెల్లించి దుకాణాలు మూయకుండా ఆపుకున్నారు. మిగతా వ్యాపారులు చేసేదిలేక దుకాణాలను మూసి, వెళ్లిపోయారు. వ్యాపారులు మరోమారు ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో అధికారులకు ఫోన్ చేసి ఇదివరకే చెప్పాను కదా అని మళ్లీ ఎందుకు ఇబ్బంది పెడుతున్నారంటూ సీరియస్‌గా చెప్పినట్లు తెలిసింది. ఐదు శాతం చెల్లింపులు చేసిన వాటికి తాళాలివ్వాలని చెప్పడంతో ఐదు శాతం డబ్బులు చెక్కుల రూపంలో కాకుండా డీడీల రూపంలో ఇవ్వాలని అధికారులు సూచించారు. దీంతో సాయంత్రానికి ఒకరిద్దరు చెల్లింపులు చేసి, తాళాలు పట్టుకెళ్లారు. ఆదివారం మరికొన్ని దుకాణాలు తెరుచుకోనున్నాయి. ప్రస్తుతానికి వ్యాపారులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ప్రస్తుతం ఐదు శాతం చెల్లించిన వాటికి అనుమతి ఇచ్చిన అధికారులు మార్చి 31 డెడ్‌లైన్ విధించారు. మార్చి 31 నాటికి పూర్తి బకాయి చెల్లించాలని, లేదంటే మళ్లీ దుకాణాలు మూసి వేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. దాంతో వ్యాపారులలో ఆందోళన వ్యక్తం అవుతోంది. డబ్బులున్న వారు చెల్లిస్తారని, లేనివారం వ్యాపారం మానుకుంటామని వ్యాపారులు చెబుతున్నారు.



వేడుకల్లో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న డీకే అరుణ, తలపాగతో ఎమ్మెల్యే, గిరిజన సంప్రదాయ అలంకరణలో కలెక్టర్ విజయేందిర బోయి

సేవాలాల్ మార్గదర్శకంలో అభివృద్ధి చెందాలి

- జయంతి వేడుకల్లో ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/పాలమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశీసులతో, వారి మార్గదర్శకంలో గిరిజన బంజారాలు అభివృద్ధి చెందాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. సంత్ సేవాలాల్ 286 జయంతి వేడుకలను పురస్కరించుకొని శనివారం గిరిజన సంఘాల నాయకులు మహబూబ్‌నగర్‌లోని క్లాక్ టవర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బంజార మహిళలుతో కలిసి, సంప్రదాయ నృత్యం చేశారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని దేశవ్యాప్తంగా నిర్వహించాలని పార్లమెంట్‌లో ప్రస్తావించడం జరిగిందన్నారు. ఈ విషయమై హోం మంత్రి అమిత్‌షాను, ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ప్రస్తావిస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో గిరిజన మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు.

సేవాలాల్ ఆశీస్సులతో అభివృద్ధి సాధిద్దాం: ఎమ్మెల్యే యెన్నం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి, ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ క్లాక్‌టవర్, పద్మావతి కాలనీ మీదుగా అయ్యప్ప కొండకు చేరుకుంది. అక్కడ జయంతి సభను నిర్వహించారు. క్లాక్ టవర్ వద్ద, అయ్యప్పకొండ వద్ద నిర్వహించిన జయంతి సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశీస్సులతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిద్దామని అన్నారు. హన్వాడ, మహబూబ్‌నగర్‌లలో ఉన్న తండాల్లో బీటీ రోడ్లకు రూ.ఐదు కోట్లతో శంకుస్థాపన చేశామన్నారు. బంజారా బిడ్డలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి ఎల్లప్పుడు తోడ్పాటు అందిస్తామన్నారు. బంజారాల లిపి గోర్‌గోలిని 8వ షెడ్యూల్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ డి.జానకి, కె.శేఖర్, ఆర్.శేఖర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, ఆనంద్‌గౌడ్, తుల సిరాం, ఛత్రపతి, కిషన్ పాల్గొన్నారు.

మహనీయుడు సేవాలాల్: శ్రీనివాస్‌గౌడ్

గిరిజన జాతికోసం అహర్నిశలు పాటుపడి, తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని మాజీ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని, పూజలు చేశారు.

ఆన్‌లైన్‌లో ఇసుక

బుక్ చేసుకోండి

- ప్రభుత్వ, గృహ అవసరాలకు ఇవ్వండి
- ఇసుకపై జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్

6



నృత్యం చేస్తున్న యువతి

జన సంద్రమైన శిల్పారామం

- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన మ్యాజిక్ షో,
- భారీగా ట్రాఫిక్ జామ్

6

భక్తులతో కిటకిటలాడిన

మన్యంకొండ



బారులు తీరిన భక్తులు

7

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు

6

జన సంద్రమైన శిల్పారామం

● ఆకట్టుకున్న నృత్య, మ్యాజిక్ షో, వెస్ట్రన్ డ్యాన్స్

● వన్‌టౌన్ నుంచి అశోక్ టాకీస్ చౌరస్తా వరకు ట్రాఫిక్ జామ్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఏటు చూసిన జనం బైక్‌లపై, కార్లపై, కాలినడకన.. ఇలా అందరి అడుగులు శిల్పారామం వైపే. మన మహబూబ్‌నగర్ మహా నగరోత్సవం కార్యక్రమంలో భాగంగా రెండోరోజు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. కలెక్టర్ విజయేందిర బోయి ప్రదర్శనలను, స్టాల్స్‌ను పరిశీలించారు. మన మహబూబ్‌నగర్ మహోత్సవాలను ప్రజలు సొంతం చేసుకోవడం సంతోకరమన్నారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించడానికి పట్టణంలోని నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో శిల్పారామం జనసంద్రమైంది. భారతీయ సాంప్రదాయం ఉట్టిపడేలా నృత్య ప్రదర్శన, మ్యాజిక్ షో, వెస్ట్రన్ డ్యాన్స్‌లు చిన్నారులనే కాకుండా అందరిని స్టెప్పులు వేయించేలా చేసింది. ప్రజలు భారీగా తరలిరావడంతో వన్‌టౌన్ నుంచి అశోక్ టాకీస్ చౌరస్తా వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్యాంక్ బండపై ఇసుక వేస్తే రాలనంత జనం పసులకిష్టరెడ్డి గార్డెన్ వరకు రద్దీగా ఉన్నారు. రోడ్డుకిరువైపులా బైక్‌లు పార్క్ చేయడంతో కాలినడకన వచ్చిన వారికి ఇబ్బందులు తప్పలేదు.

మరో రోజు పొడిగింపు

మహబూబ్‌నగర్: నగరంలోని శిల్పారామంలో రెండు రోజులుగా జరుగుతున్న మహా నగరోత్సవ కార్యక్రమాలు మరో రోజు పొడగిస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శుక్ర, శని వారాలే నిర్వహించాలని భావించినా ప్రజల నుంచి స్పందన రావడం, నేడు ఆదివారం సెలవు రోజు కావడంతో జనం మరింత పెరిగే అవకాశం ఉండగా ఆదివారం కూడా నిర్వహించాలని నిర్ణయించారు. ఉదయం 10:30 గంటలనుంచి రాత్రి 8:30 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ట్యాంక్ బండ్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ

ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకోండి

● ప్రభుత్వ, గృహ అవసరాలకు ఇవ్వండి

● ఇసుకపై జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ విజయేందిర బోయి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని అడ్డాకుల మండలం కన్మనూర్ రీచ్, పొన్నకల్‌లోని రెండు ఇసుక రీచ్‌ల నుంచి మన ఇసుక వాహనం ద్వారా ప్రభుత్వ, గృహ అవసరాల కోసం ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. శనివారం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ అధికారులు, తహసీల్దార్లు, ఎస్‌హెచ్‌వోలు, ఇరిగేషన్, హౌసింగ్ అధికారులతో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక సరఫరా, అక్రమ రవానాను అరికట్టడంపై చర్చించారు. జిల్లాలో గుర్తించిన మిగతా ఇసుక రీచ్‌లను ప్రారంభించి, మన ఇసుక వాహనం ద్వారా ఇసుక సరఫరా చేయాలని చెప్పారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు కూడా స్థానికంగా ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని ఆదేశించారు. ఇసుక కొరత ఉన్న చోట క్రషర్ ఇసుక ఉపయోగించవచ్చన్నారు. దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. 2024 ఫిబ్రవరి 16న హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఫిల్టర్ ఇసుక తయారీ నిషేధమని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల టాస్క్ ఫోర్స్ కమిటీలను ఆదేశించారు. ఇసుకను అక్రమంగా రవాణ చేసిన వాహనాలను సీజ్ చేసి, జరిమానా విధించాలన్నారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక అక్రమ రవాణ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, గనుల శాఖ సహాయ సంచాలకులు సంజయ్ కుమార్, భూగర్భ జనవనరుల శాఖ డీడీ రమాదేవి, డీఆర్‌డీవో నర్సింహులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకంతో భూమి విరాసత్



కవితతో స్టేట్‌మెంట్, సంతకం రికార్డు చేయిస్తున్న ఆర్డీవో రాంచందర్

● కలెక్టర్‌ను నివేదిక కోరిన లోకాయుక్త

● ఆర్డీవో సమక్షంలో విచారించి దరఖాస్తుదారుడి సంతకం రికార్డు

నారాయణపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భూవ్యవహారం ఫోర్జరీ సంతకంపై శనివారం పేట ఆర్డీవో కార్యాలయంలో బాధితురాలు కవితకు సంబంధించిన స్టేట్‌మెంట్‌తో పాటు, ఆమె సంతకాన్ని ఆర్డీవో రాంచందర్ రికార్డు చేశారు. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని దామరగిద్దలో మల్లికార్జున్ అనే వ్యక్తికి 5.33 ఎకరాల భూమి ఉంది. 2016 నవంబరు 16న మల్లికార్జున్ మృతి చెందాడు. ఈయనకు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉండగా, రెండో భార్య ఓ కూతురు కవిత ఉంది. తండ్రి మృతిచెందిన తర్వాత ఇద్దరు కుమారులు భూమిని తమ పేరున చేసుకొని విరాసత్‌లో తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపిస్తూ కవిత లోకాయుక్తతో పాటు, సీఎం దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు దామరగిద్ద పోలీసులు 2023 డిసెంబరు 11న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఆర్డీవో బాధితురాలు కవిత సంతకాన్ని, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

నాలుగేళ్ల చిన్నారిపై
అత్యాచారయత్నం

● దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పాలమూరులో మరో దారుణం చోటు చేసుకున్నది. నాలుగేళ్ల చిన్నారిపై 55 ఏళ్ల వయస్సున్న వ్యక్తి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. చిన్నారి తల్లి గమనించడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు ఆ కీచకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మహబూబ్‌నగర్ టుటౌన్ సీఐ ఎజాజుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న ఖాజ(55) చికెన్‌సెంటర్‌లో పని చేస్తాడు. తన పక్క ఇంట్లో ఉంటున్న నాలుగేళ్ల చిన్నారిపై కన్నేశాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆడుకుంటున్న చిన్నారిని తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. చిన్నారి దుస్తులు విప్పి అత్యాచారానికి ఒడిగడుతున్న సమయంలోనే ఆమె తల్లి కూతురు కనిపించకపోవడంతో వెతుక్కుంటూ పక్కింట్లోకి వెళ్లింది. చిన్నారిపై ఖాజ అఘాయిత్యానికి పాల్పడుతుండటాన్ని గమనించి కేకలు వేసింది. చుట్టుపక్కల ఉన్నవారంతా అక్కడికి చేరుకొని ఖాజకు దేహశుద్ధిచేసి పోలీసులకు సమాచారం అందించారు. తల్లి అప్రమత్తం కావడంతో చిన్నారిపై ప్రమాదం తప్పింది. టుటౌన్ పోలీసులు కామాంధుడికి తమదైన శైలిలో బుద్ధి చెప్పి కామాంధుడిపై పోక్సో ఎస్సీ ఎస్టీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడుని రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణ కోసమే
కమ్యూనిటీ కాంటాక్ట్

● ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం: డీఎస్పీ లింగయ్య



సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

మరికల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని మాదారం రోడ్డు, గజ్జలమ్మగడ్డ కాలనీలో శనివారం తెల్లవారుజామున ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు, హెచ్‌సీ, ఆరుగురు పీసీలు, స్పెషల్ పార్టీ సిబ్బంది 77 మంది, పోలీసులు ఆరు పార్టీలుగా విడిపోయి ఆకస్మికంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రతీ ఇళ్లల్లో వ్యక్తిగత వివరాలు సేకరించారు. 150 ఇళ్లల్లో సోదాలు చేశారు. సరైన పత్రాలు లేని 65 ద్విచక్ర వాహనాలు, మూడు గూడ్స్ ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు చూపించి వాటిని తిరిగి తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించామన్నారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మహిళలు, విద్యార్థినులు, చిన్నారులను వేధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులతో పాటు, ప్రతీ ఒక్కరు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐలు రాజేందర్‌రెడ్డి, శివశంకర్, ఎస్‌ఐలు రాములు, రమేష్, కృష్ణంరాజు, మహిళ ఎస్‌ఐ రేవతి, మహేశ్వరి, ఎస్‌ఎం నవీద్, ఏఎస్‌ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

చెంచుల సంప్రదాయం ప్రకారం
శివపార్వతుల కల్యాణం

- ఆలయ కమిటీ అధ్యక్షుడు తోకల గురువయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు తోకల గురువయ్య

లింగాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని భౌరాపూర్ చెంచుపెంటలో శివరాత్రి ఉత్సవాలను చెంచుల సంప్రదాయాల ప్రకారం నిర్వహించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు తోకల గురువయ్య అన్నారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది ప్రభుత్వపరంగా శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నారే తప్ప చెంచు గిరిజనులకు ప్రాధాన్యతనివ్వడం లేదని ఆరోపించారు. గతేడాది ఆలయ అభివృద్ధి, రోడ్ల మరమ్మతుల కోసం రూ.50లక్షలు మంజూరైతే, ఆ నిధులు ఎక్కడా అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. అదేవిధంగా నల్లమల లోతట్టు ప్రాంతంలో ఉన్న భౌరాపూర్ చెంచుపెంటలకు వాహనాల రాకపోకలు సాఫీగా సాగడానికి ఐటీడీఏ ద్వారా రోడ్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్ల మరమ్మతు పనులు యంత్రాల ద్వారా పనులు చేస్తుండడంతో ఇక్కడ నివసిస్తున్న చెంచు గిరిజనులకు ఉపాధి లేకుండా పోతుందని అన్నారు. కలెక్టర్, ఐటీడీఏ, ఐటీఈఏ అధికారులు స్పందించి శివరాత్రి ఉత్సవాల్లో చెంచులకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ బాలగురువయ్య, సామాజిక కార్యకర్త బాలాజీనాయక్, సలేశ్వరం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

- ఐదు రోజులపాటు శిక్షణ

ఉప్పునుంతల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాల ఆవరణలో శనివారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 34వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు అభ్యర్థుల ఎంపిక నిర్వహించారు. ఈ పోటీలకు 138 మంది పాల్గొనగా 30 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ తెలిపారు. ఎంపిక అయినవారికి ఐదు రోజుల పాటు కబడ్డీ ఆటలలో శిక్షణ ఇచ్చి అందులో నుంచి 12 మందిని ఎంపిక చేసి ఈ నెల 20వ తేదీన వికారాబాద్‌లో జరగనున్న 34వ తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

రేపు కొల్లాపూర్
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

కొల్లాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (ఫాక్స్‌కాన్) కంపెనీ ఆధ్వర్యంలో ఈనెల 17న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రెజ్యూమ్, అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు 2 సెట్ల జిరాక్స్ కాపీలు, 2 పాస్ ఫొటోలు తీసుకుని రావాలని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ అర్హతలు కలిగి, 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలు మధ్య ఉన్న అభ్యర్థులు ఫోన్ నెంబర్స్ 9290086457, 8519991419 లను సంప్రదించాలని తెలిపారు.

గద్వాల నియోజకవర్గానికి ఏడు సబ్‌స్టేషన్లు

- ముఖ్యమంత్రి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



రైతులకు సబ్‌స్టేషన్‌ల ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గద్వాల నియోజకవర్గానికి సుమారు రూ. 20.83 కోట్ల నిధులతో 7 సబ్‌స్టేషన్లు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం గద్వాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొసీడింగ్‌లను రైతులకు, గ్రామస్థులకు అందజేస్తూ ముఖ్యమంత్రి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గుడెందొడ్డి, పెద్దపాడు, కుర్తిరావుల చెరువు, తుమ్మల చెరువు, తుర్కోనిపల్లి, ఉలిగెపల్లి, సోంపురం గ్రామాలకు సబ్‌స్టేషన్‌లు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. గద్వాల ప్రజల చిరకాల వాంచను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గద్వాల నియోజక వర్గం సస్యశ్యామలంగా మారడానికి ఎన్నో రోజులు లేవని, నియోజకవర్గ రైతులకు నాణ్యమైన కరెంటును సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు, గ్రామస్థులు ఉన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సభ్యురాలు భవాని



రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సభ్యురాలు భవానిని సన్మానిస్తున్న సిబ్బంది

బిజినేపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సభ్యురాలు భవాని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం ప్రభుత్వ వేంకటేశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో శనివారం రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా వారిని చేరదీయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా వారిని విద్యార్థులు చైతన్య పర్చాలని తెలిపారు. వివాహేతర సంబంధాలకు దూరంగా ఉండాలని, ఒకే సిరంజిని ఎక్కువ మందికి ఉపయోగించకుండా జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మజ, అధ్యాపకులు నాగరాజు, సుష్మ, శివ, రాధాకుమారి, స్వప్న, నాగలింగం, వెంకటేష్, రమేష్ ప్రకాష్, మనోజ్, ప్రవళిక, రమ్య ఉన్నారు.

రేపు మహిళా జాబ్ మేళా

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం మహిళా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు టాస్క్, సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థల సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, నర్సింగ్‌లో పాస్, ఫెయిల్ అయిన విద్యార్థినులు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి ఉచిత వసతితోపాటు భోజన సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు సోమవారం ఉదయం 10గంటలకు కల్వకుర్తిలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

క్షయవ్యాధి శిబిరం విజయవంతం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

చారకొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం నిక్షయ్ శివిర్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి మంజు భార్గవి ఆధ్వర్యంలో నిర్వహించిన క్షయవ్యాధి శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలున్న వారికి ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేసి ప్రథమ చికిత్సలు చేశామన్నారు. మొత్తం 170 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ఆమె తెలిపారు. క్షయవ్యాధి శిబిరాన్ని తహసీల్దార్ సునీత పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగన్‌లాల్, సీహెచ్‌వో శేఖర్‌రెడ్డి, హెచ్‌ఈవోలు మిషేక్, ఎన్డీవీచారి, ఎస్‌టీఎస్ శరత్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాకు వెళ్తూ
చెట్టును ఢీకొన్న కారు

- ఒకరి మృతి, నలుగురికి తీవ్ర గాయాలు

- స్వల్పగాయాలతో బయటపడ్డ మరొకరు



చెట్టును ఢీకొనడంతో నుజ్జునుజ్జైన కారు



నవ్యశ్రీ (ఫైల్)

అలంపూరుచౌరస్తా, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్తూ చెట్టును ఢీకొన్న కారు.. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయలయ్యాయి. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు సమీపంలో రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన రెండు కుటుంబాల నుంచి ఆరుగురు కుంభమేళా యాత్రకు కారులో బయలుదేరారు. శనివారం తెల్లవారుతుండగా జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం, ఇటిక్యాలపాడు శివారులో 44వ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి రోడ్డు కిందివైపునకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న అరుగురిలో నవ్యశ్రీ, రేణుక, బస్వారాజ్, రాజన్న, శోభ, ప్రతిభలు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న 108, హైవే అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను కర్నూలు ఆసుపత్రికి తరలిస్తూ ప్రథమ చికిత్స చేస్తుండగానే నవ్యశ్రీ (18) మృతి చెందింది. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. రాజన్న బావమరిది మంజునాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో షాప్ దగ్ధం

- రూ.50 లక్షల ఆస్తినష్టం

పెబ్బేరు రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషన్ షాప్ దగ్ధమైన సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. షాప్ యజమాని గౌని యుగేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు పట్టణంలోని ఇంజనీరింగ్, ఎలక్ట్రీషన్ షాప్‌లో అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. రోడ్డు పక్కన పుచ్చకాయలు విక్రయించే వ్యక్తుల సమాచారం మేరకు ఇంటి నుంచి బయటకు వచ్చి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేలోపే షాప్‌లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయాయని తెలిపారు. దాదాపుగా రూ.50లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ ఘటన జరుగడంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి సంఘటన స్థలానికి వచ్చి షాప్ యజమానిని మరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.



పెబ్బేరులో కాలిపోయిన షాప్

క్రైం కార్నర్

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వడ్డేపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌లో శనివారం మారన్న(37) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు. కర్నూలు జిల్లా ఈతాం డ్రపాడు గ్రామానికి చెందిన మారెన్న రాజోలి గ్రామానికి దేవర కోసం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమం ముగించుకుని శుక్రవారం శాంతి నగర్‌లో సంత కావడంతో బిక్షాటన చేసిన డబ్బుల కోసం భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. మద్యానికి బానిసై ఉరి వేసుకున్నాడని భార్య వసంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

గద్వాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండలంలోని బీరెల్లిలో శనివారం తెల్లవారుజామున తెలుగు పెద్ద బీచుపల్లి(47) పాము కాటుతో మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. తెల్లవారుజామున పెద్ద బీచుపల్లి చేపలవేటకు కృష్ణానదికి వెళ్తుండగా, దారిలో పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులకు తెలుపగా, గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుమారుడు తెలుగు నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ, కారు ఢీ : ఒకరికి గాయాలు

జడ్చర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని హౌసింగ్‌బోర్డు సమీపంలో శనివారం లారీ, కారు ఢీకొన్నాయి. ముందుగా వెళ్తున్న లారీని అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుకనుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. కారు నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. కారు ముందుభాగం ధ్వంసమైంది.

దంపతులపై దాడి, తీవ్ర గాయాలు

కోడేరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని కొండ్రావుపల్లిలో భార్యభర్తలపై దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం కొండ్రావుపల్లికి చెందిన చెందిన జూపల్లి శ్రీనివాస్‌రావు పొలంలో అదే గ్రామానికి చెందిన జూపల్లి అర్జున్‌రావు గేదె వచ్చి మేస్తుండగా ఇద్దరి మధ్యన వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో జూపల్లి అర్జున్‌రావు అతని కుమారుడు జూపల్లి బాబురావు ఇద్దరు కలిసి శ్రీనివాసరావు, భార్య వనజను ఇంటికి వెళ్లి దాడి చేయగా వారి తలలకు బలమైన గాయాలయ్యాయి. జూపల్లి వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోకారి తెలిపారు. శ్రీనివాసరావు వనజను చికిత్స కోసం హైదరాబాద్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు


ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ మొగులయ్య

అలంపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గద్వాల డీఎస్పీ మొగులయ్య అన్నారు. శనివారం అలంపూర్ ప్రాంతంలోని తుంగభద్రానది తీరంలో ఇసుక రీచ్‌లను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతి ఉన్న వాహనాలు మాత్రమే ఆయా రీచ్‌ల నుంచి ఇసుకను తరలించాలని సూచించారు. అనుమతి లేకుండా ఇసుకను తరలించేందుకు పాల్పడితే చర్యలు తీసుకోవటంతో పాటు, వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి మండలంలో వాగులపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. ఈయన వెంట ఎస్ఐ వెంకటస్వామి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బాలానగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం ఉమ్మడి గుండెడు టీడీగుట్టతండా శివారులో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లెనిన్ వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా మండల కేంద్రం వైపు ఇసుకను తీసుకొస్తుండగా సిబ్బంది గుండేడ్ శివారులో అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిర్వహించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు ముమ్మరం

అలంపూరు చౌరస్తా, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోళ్లకు వచ్చిన వైరస్ వ్యాప్తి నివారణకు చేపట్టిన తనిఖీల్లో గుడ్లను కూడా వెనక్కి పంపుతున్నట్లు వెటర్నరీ డాక్టర్ శంకరయ్య తెలిపారు. ఏపీ-తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ముమ్మరంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. శనివారం బెంగళూరు, తమిళనాడు, ఏపీలోని ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి వచ్చే వాహనాలను గమనిస్తూ గుడ్లు, బ్రాయిలర్ కోళ్ల లోడులతో వచ్చే వాహనాల వివరాలను నమోదు చేసుకుని తిప్పి పంపుతున్నట్లు అధికారులు తెలిపారు.

నేచర్ గైడ్ శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలో గల కొల్లాపూర్, లింగాల, పదర, అమ్రాబాద్, అచ్చంపేట, బల్మూరు మండలాల పరిధిలో గల చెంచు యువకులకు ప్రకృతి మార్గదర్శి (నేచర్ గైడ్) కోర్సులో శిక్షణ నిమిత్తం దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోహిత్ గోపిడి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకో టూరిజం అభివృద్ధి చేయడం, ప్రకృతి వన్యప్రాణులను సంరక్షించడం, బాధ్యతాయుత పర్యాటక విధానాలను మెరుగుపరచడం వంటి అంశాలపై బెంగుళూరులో 45 రోజుల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నల్లమల ఇకో టూరిజం ప్రాజెక్టులో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. పదో తరగతి వరకు చదివి ఉత్తీర్ణత సాధించినా, సాధించకపోయినా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. 30 మందికి శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పిస్తున్నామని, ఆసక్తి కలిగిన చెంచు యువత ఈ నెల 22లోగా మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. వచ్చిన దరఖాస్తుదారుల్లో 30 మందిని శిక్షణ కోర్సులకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అల్లీపూర్ విద్యార్థులు


నందిని


అలేఖ్య

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 18, 19వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో జరిగే 11వ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అల్లీపూర్ చెందిన నందిని, అలేఖ్య ఎంపికయ్యారు. ఈ నెల 15న వనపర్తిలో నిర్వహించిన జిల్లా స్థాయిలో అండర్-14 విభాగంలో 60 మీటర్ల లాంగ్ జంప్, హైజంప్‌లో పాల్గొని మొదటి స్థానంలో బంగారు పతకం సాధించింది. అలాగే అండర్ -16 విభాగంలో అలేఖ్య జావెలిన్ త్రో, డిస్కస్‌త్రో లో మొదటి స్థానంలో బంగారు పతకం సాధించింది. వీరి ఎంపికపై మాజీ సర్పంచ్ రఘువర్ధన్‌గౌడు, విష్ణుమూర్తి, క్రీడాకారులు నవీన్, నరేష్ హర్షం వ్యక్తం చేశారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందేనా?

- పూర్తయిన కేఎల్ఐ డీ-82 కాల్వ
- ప్రధాన కాల్వకు తూములు, గండ్లతో తగ్గిన నీటి వేగం


శంకరకొండ తండా వద్ద పూర్తయిన కేఎల్ఐ డీ- 82 కాలువ


ఎంజీకేఎల్ఐ ప్రధాన కాల్వ

కల్వకుర్తి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కేఎల్ఐ డీ-82 కాల్వ 59.5కిలో మీటర్లు ఇటీవల పూర్తయ్యింది. కాల్వలో సాగు నీరు పారాలంటే నీటి వేగం తక్కువగా వస్తుండడంతో మాడ్గుల మండలం చివరి ఆయకట్టుకు నీరందడానికి ఇబ్బందిగా మారింది. ఎంజీకేఎల్ఐ ప్రధాన కాల్వ గుడిపలి గట్టు నుంచి జంగారెడ్డిపల్లి వరకు 160.5కిలో మీటర్లు గతంలోనే పూర్తయ్యి, ప్రధాన కాల్వలో సాగునీరు పారుతోంది. గుడిపల్లి గట్టు నుంచి ప్రధాన కాల్వపై ఉన్న తూములకు గేట్లు లేకపోవడంతో నీరు అవసరానికి మించి బయటకు వెళ్తోంది. దీంతో నీటి వేగం బాగా తగ్గింది. ఎంజీకేఎల్ఐ ప్రధాన కాల్వపై 82వరకు తూములు ఉంటే కేవలం పది తూములకు మాత్రమే గేట్లు ఉన్నాయి. ముందున్న నియోజకవర్గాలకే గుడిపల్లిగట్టు నుంచి ప్రధాన కాల్వకు దగ్గరల్లో ఉన్న వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలు సాగు నీటిని ఎక్కువగా వినియోగించుకుంటున్నాయి. చివరి ఆయకట్టుకు సాగునీరందాలంటే నీటి వేగం ప్రధాన కాల్వలో పెరగాల్సి ఉంది. కాల్వకు గండ్లు పెట్టి నీటిని వృథా చేస్తే సహించేది లేదని, కాల్వలు తెగకుండా, గండ్లు పడకుండా చూడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి చొరవ తీసుకోవడంతో కేఎల్ఐ డీ-82 కాల్వలో ప్రస్తుతం సాగునీరు జంగారెడ్డిపల్లి నుంచి 28వ కిలో మీటరుకు చేరింది. నీటి ప్రవాహం వేగంగా ఉంటే చివరి ఆయకట్టు మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీరు చేరనుంది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కేఎల్ఐ ప్రాజెక్టు సార్థకత రానుంది.

చివరి ఆయకట్టుకు సాగునీరందేలా చూస్తాం..

ఎంజీకేఎల్ఐ ప్రధాన కాల్వ 160.5 కిలో మీటర్లు జంగారెడ్డిపల్లి ఇదివరకే పూర్తయ్యింది. జంగారెడ్డిపల్లి నుంచి నాగిళ్ల వరకు కేఎల్ఐ డీ-82 కాల్వ పూర్తయ్యింది. కాల్వలో నీటి వేగం పెరిగితే నాగిళ్ల చివరి ఆయకట్టు వరకు సాగునీరు పారనుంది. వట్టెం రిజర్వాయర్ నుంచి లింకు ద్వారా కేఎల్ఐ కాల్వకు సాగునీరు కలపాలని ప్రతిపాదన ఉంది. టెండరు పూర్తయ్యి లింకు కాల్వ పని జరిగితే కేఎల్ఐ కాల్వలో నీటి ప్రవాహానికి ఇబ్బంది ఉండదు.

\- దేవన, డిప్యూటీ ఈఈ

స్కూల్ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

- ఆందోళన చేపట్టిన తల్లిదండ్రులు



కాలువలో దిగబడిన స్కూల్ బస్సు టైరు

జడ్చర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని సాయినగర్‌కాలనీలో స్కూల్ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని కొత్తతండా సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు శనివారం మధ్యాహ్నం వెంకటేశ్వరకాలనీ, సాయినగర్ కాలనీలో విద్యార్థులను ఎక్కించుకునేందుకు బస్సులు వచ్చాయి. వాటిలో ఒక బస్సు వెంకటేశ్వర కాలనీలో నుంచి సాయినగర్ కాలనీలోకి వచ్చే మలుపు వద్ద రోడ్డు పక్కన ఉన్న మురుగు కాలువను డ్రైవర్ గమనించలేదు. విద్యార్థులతో ఉన్న స్కూల్ బస్సు ముందు భాగంలో ఉన్న టైరు కాలువలో ఇరుక్కుపోయింది. కాగా స్కూల్ బస్సులో ఉన్న విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలో పరీక్ష కేంద్రం ఉండడంతో మధ్యాహ్నం వేళ పాఠశాలను నిర్వహిస్తున్నారని తల్లిదండ్రులు తెలిపారు. బస్సులకు అనుభవం ఉన్న డ్రైవర్‌లను నియమించాలని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా ఉండే డ్రైవర్‌లను నియమించవద్దంటూ తల్లిదండ్రులు కోరారు.

పురాతన కట్టడాల సందర్శనతోనే చరిత్రపై ఆసక్తి


నంది వడ్డెమాన్‌లోని కాకతీయు కాలం నాటి నందీశ్వరాలయంలో విద్యార్థులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పురాతన కట్టడాలను క్షేత్ర సందర్శన చేస్తేనే చరిత్రపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్ నందీశ్వరాలయం, శనీశ్వరాలయం, త్రిమూర్తుల, లక్ష్మీచెన్నకేశవ, వీరభద్రస్వామి ఆలయాలను శనివారం విద్యార్థులతో కలిసి సందర్శించారు. కాకతీయుల చరిత్రను ప్రిన్సిపాల్ వివరించారు. గోన బుద్దారెడ్డి, గోన గన్నారెడ్డి గురించి తెలిపారు. శత్రువు రాజ్యాల దాడి నుంచి ప్రజలను, రాజ్యాన్ని కాపాడుకోవడానికి అప్పటి పాలకులైన రాజులు కోట నిర్మాణాలు, రక్షణ వలయాల ఏర్పాటును చూపి చరిత్రపై విద్యార్థుల్లో మక్కువ కల్పించారు. అనంతరం నందీశ్వరాలయం, శనీశ్వరాలయంలో విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బహుల తదియ శనివారం కావడంతో భక్తులు శనీశ్వర స్వామికి తిల తైల ఇతర పూజ సామగ్రితో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ధర్మ, అధ్యాపక బృందం, ఆలయ చైర్మన్ గోపాల్ రావు, అర్చకులు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి, శాంతి కుమార్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మన్యంకొండ


దర్శనానికి క్యూలైన్‌లో నిలిచిన భక్తులు


ఆలయ ఆవరణలో భక్తులు

మహబుబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్, అర్చకులు, స్వామివారికి అభిషేకాలు చేసి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు దాసంగాలను సమర్పించారు. అనంతరం శేషవాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ రేషన్ కార్డుల దరఖాస్తులు

- మీ సేవ కేంద్రాలకు ప్రజల పరుగులు
- పదేళ్లగా రేషన్‌కార్డుల కోసం నిరీక్షణ


నారాయణపేటలోని ఓ మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

నారాయణపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల జారీ అర్హులను ఊరిస్తూనే ఉంది. జనవరిలో జరిగిన కులగణన సర్వేలో లబ్ధిదారులను గుర్తించి జాబితాలను గ్రామసభల్లో ప్రదర్శించారు. ఇందులో చాలా మంది పేర్లు లేకపోవడంతో.. మళ్లీ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అయితే తాజాగా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణకు పౌరసరఫరాల శాఖ అవకాశం కల్పించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న కేంద్రాల్లో దరఖాస్తుదారుల సందడి నెలకొంది. జిల్లాలో ప్రజాపాలన గ్రామసభల్లో కొత్త కార్డుల కోసం 17,253 దరఖాస్తులు వచ్చాయి. పేర్ల చేర్పుల కోసం 22,576 దరఖాస్తులు రాగా, రేషన్ కార్డుల విభజన కోసం 7,386 వచ్చాయి. రేషన్‌కార్డులలో తమ పిల్లల పేర్లు లేక పోవడంతో పాటు వివాహలు జరిగి కొత్తగా ఇళ్లకు వచ్చిన కోడళ్ల పేర్లు చేర్పుల కోసం ఆరాటపడుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కొత్త కార్డులు, పేర్ల చేర్పులు, విభజనల కోసం మొత్తం 47,215 దరఖాస్తులు వచ్చాయి. తాజాగా మీసేవ ద్వారా అందే దరఖాస్తులతో మరింతగా సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

శ్రీశైలం వెళ్లే వాహనాలకు ఊరట

- నల్లమలలో 24 గంటలు అనుమతి
- 23 నుంచి వచ్చే నెల 1 వరకు అవకాశం


మన్ననూరు దుర్వాసుల చెరువు చెక్‌పోస్టు

మన్ననూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే యాత్రికుల వాహనాలకు ఈ నెల 23 నుంచి మార్చి 1వ తేదీ వరకు మన్ననూరు, దోమలపెంట అటవీ చెక్ పోస్టుల నిబంధనలను సడలిస్తూ అటవీ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంత ఎఫ్‌డీవో రామమూర్తి శనివారం ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రికి రద్దీని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యార్థం నిబంధనలతో కూడిన అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి వాహనం యొక్క వివరాలు చెక్‌పోస్టుల వద్ద రికార్డుల్లో నమోదు చేసుకొని రాత్రి వేళల్లో 20 వాహనాలను కలిపి ఒకసారిగా అడవిలో రహదారిపై హారన్ శబ్దాలు లేకుండా వెళ్లడం, 40 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా నిబంధనలు రూపొందించామని వివరించారు. అతిక్రమించే వాహన చోదకులపై అటవీశాఖ చట్ట పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. అడవిలో వెళ్లే వాహనాల కదలికలపై చెక్‌పోస్టుల పరిధిలోని రహదారిపై తనిఖీలు నిర్వహిస్తారని వివరించారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు

గండీడ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అందరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని పగిడ్యాల్‌లో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శాంతిరంగ్యా, సునీత, అనంతలక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

- పీయూలో విద్యార్థుల నిరసన


విద్యార్థులతో మాట్లాడుతున్న పీయూ రిజిస్ట్రార్ చెన్నప్ప

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శనివారం ఫార్మసీ కళాశాల హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఫార్మసీ హాస్టల్ నుంచి పీయూ ప్రధాన గేటు వరకు నినాదాలతో ర్యాలీగా వచ్చి ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న వీసీ జీఎన్ శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తారమని, పరిపాలన భవనానికి రావాలని, ధర్నాలు చేయొద్దని చెప్పారు. కాసేపటి రిజిస్ట్రార్ చెన్నప్ప సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

అర్హులైన చెంచులకు రేషన్‌కార్డులు

- అచ్చంపేట ఆర్డీవో మాధవి


అమ్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మాధవి

అమ్రాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజవర్గంలోని అర్హులైన ఆదిమ జాతి చెంచు గిరిజనులందరికీ ప్రభుత్వం నుంచి రేషన్ కార్డులను అందిస్తామని అచ్చంపేట ఆర్డీవో మాధవి తెలిపారు. శనివారం అమ్రాబాద్ ఉమ్మడి మండలంలోని చెంచుపెంటల్లో పర్యటించి రేషన్ కార్డులు అందని వారి వివరాలను ఆమె తెలుసుకున్నారు. అమ్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆర్డీవో మాట్లాడుతూ.. నల్లమల ప్రాంతంలోని పలు మండలాల్లో 71 చెంచు పెంటల్లో 844 మంది అర్హులైన చెంచులకు రేషన్ కార్డులు అందలేదని తెలిపారు. వారందరికీ తక్షణమే అందించే విధంగా చర్యలు తీసుకుంటుమన్నట్లు వెల్లడించారు. ఆయా మండలాల తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాలని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంటర్వ్యూ..

48వేల ఎకరాలకు పైగా సాగు భూమి

▸ ఏవో గోపీనాథ్



జడ్చర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలంలో 48 వేల ఎకరాలకు పై చిలుకు భూమి సాగుకు అనుకూలంగా ఉందని ఏవో గోపీనాథ్ తెలిపారు. మండలంలో రైతులు పండించే పంటలు, ఎన్ని ఎకరాలలో సాగు చేస్తున్న అంశాన్ని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

మండలంలో సాగు భూమి ఎంత?

జడ్చర్ల మండలంలో 48వేల ఎకరాలకు పైగా సాగుకు అనుకూలమైన భూమి ఉంది. వానాకాలంలో 39వేల ఎకరాలు, రబీ సీజన్‌లో 10వేల ఎకరాలకు పైగా సాగు రైతులు వివిధ పంటలను సాగుచేస్తారు.

ఎలాంటి నేలలు ఉన్నాయి?

మండలంలో అత్యధికంగా ఎర్రమట్టి నేలలు, చెలక నేలలు ఉన్నాయి. కోడ్గల్ ప్రాంతంలో కొంతమేర నల్లమట్టి నేలలు ఉన్నాయి.

రైతులు పండించే పంట వివరాలు?

మండలంలో యాసంగి సీజన్‌కు వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలు పండిస్తున్నారు. వీటిలో 7,850 ఎకరాల్లో వరి, 1,650 ఎకరాల్లో మొక్కజొన్న, 1.575 ఎకరాల్లో వేరుశనగతో పాటు ఆముదాలు, జొన్నలు, కూరగాయలు సాగుచేస్తున్నారు.

పంటలకు సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా?

మండలంలోని ఆగ్రోస్ సెంటర్‌లతో పాటు ఫర్టిలైజర్స్ డీలర్ల వద్ద ఫర్టిలైజర్ సమృద్ధిగా ఉంది. మార్క్‌ఫెడ్ నుంచి బఫర్ స్టాకుతో ఇండెంట్ మేరకు సరఫరా చేస్తున్నారు.

చిన్నచింతకుంట ఎస్ఐగా రామ్‌లాల్



చిన్నచింతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చిన్నచింతకుంట ఎస్ఐగా రామ్‌లాల్ శనివారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన శేఖర్ నారాయణపేటకు వీఆర్‌పై వెళ్లగా, రామ్‌లాల్ వీఆర్‌ఎస్ఐ నారాయణపేట నుంచి ఇక్కడకు వచ్చారు.

ఐక్యతతో పనిచేయాలి

పాలమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : టీజీవో ఉద్యోగులు ఐక్యతతో ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ కలెక్టర్ కార్యాలయంలో 2025 క్యాలెండర్‌ను కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి ఆవిష్కరించారు.

18న రౌండ్‌టేబుల్ సమావేశం

పాలమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో 18న బీసీ సమగ్ర కులగణన నివేదికపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో సమావేశ కరపత్రం విడుదల చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు హాజరవుతారని, బీసీ కుల, ప్రజా సంఘాలు, మేధావులు, రాజకీయ, విద్యార్థి, యువజన నాయకులు పాల్గొనాలని కోరారు. సారంగి లక్ష్మీకాంత్, బుగ్గన్న, రవి, సత్యనారాయణ, ఆంజనేయులు, విశ్వనాథం, తిరుపతయ్య, రఘు పాల్గొన్నారు.

నేటి నుంచి 28 వరకు వివరాలు నమోదు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి 28 వరకు సామాజిక, ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ, కుల సమగ్ర సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందుకు గాను టోల్ ఫ్రీ నెంబర్ 040-21111111 కు కాల్ చేసి లేదా గ్రామీణ ప్రాంతాల ప్రజలు సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సహాయ కేంద్రాల్లో, మునిసిపల్ ప్రాంత ప్రజలు మునిసిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

ధర్మభిక్షం జయంతి

పాలమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజల మనిషి, గీత పనివారాల సంఘం పితామహుడు, మాజీ ఎంపీ ధర్మభిక్షం అని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ధర్మభిక్షం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచి ప్రజల పక్షాన వాణి వినిపించారన్నారు. కె.రాము, చాంద్‌పాషా, బస్వరాజు, మహేష్, బాలరాజు, నిజాంపాషా, ఇందిరమ్మ, సుజాత పాల్గొన్నారు

కుల గణన సర్వేలో పాల్గొనాలి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి ప్రభుత్వ ఆదేశాను సారం ఈ నెల 28 వరకు గతంలో నిర్వహించిన కుల గణన సర్వేలో పాల్గొనని వారి తమ కుటుంబ సభ్యుల పేర్లు నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చిందని ఎంపీడీవో జయ రాములు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో ఉండి పేర్లు నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేసుకోవాలన్నారు. లేదంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సేవాలాల్ చూపిన మార్గంలో నడుద్దాం

▸ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

▸ ఆదర్శప్రాయుడు సేవాలాల్ : ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ▸ తండాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

▸ సేవాలాల్ సేవలు మరువలేనివి : పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



కలెక్టరేట్‌లో సేవాలాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం



కోయిలకొండలో గిరిజన దుస్తులతో ర్యాలీలో పాల్గొన్న చిట్టెం పర్ణికారెడ్డి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/హన్వాడ/ గండీడ్/రాజాపూర్/మిడ్జిల్ /మహమ్మ దాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మీ ఐక్యత ఎన్నటికీ విచ్ఛిన్నం కారాదని, మీరంతా సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో మిమ్ములను భాగస్వాములుగా చూస్తున్నామన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలకు కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం గెజిటెడ్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. సకల జనుల సమ్మెలో ఉద్యోగుల పాత్ర కీలకం అని, వారు పోరాటాలు చేయకపోతే రాష్ట్రం వచ్చేదా అన్ని గత ప్రభుత్వానికి చురకలు అంటించారు. ఒక వ్యక్తి కోసమో, ఒక కుటుంబం కోసమో పనిచేయడం స్వేచ్ఛ కాదని, మీ హక్కుల కోసం పోరాటంతో తప్పులేదన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహరెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి పాల్గొన్నారు.

● హన్వాడ మండలం అమ్మాపూర్ తండాలో సేవాలాల్ జయంతిలో తహసీల్దార్ కిష్టానాయక్ పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎనమిద్‌తండా, పిల్లిగుండు, హన్వాడలో ర్యాలీ నిర్వహించారు. గండీడ్ మండల చెన్నాయిపల్లి, పంచాంగాలతండా, తువ్వగడ్డతండా, గోవిందుపల్లితండాల్లో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజాపూర్ మండల కేంద్రంలోని సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, బీఆర్ఎస్ నాయకుడు చించోడ్ అభిమన్యురెడ్డి సేవాలాల్ జయంతో పాల్గొన్నారు. మిడ్జిల్ మండల కేంద్రంలోని గిరిజన నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సేవాలాల్ ఆలయ నిర్మాణం చేసే స్థలం వద్ద నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గచ్చిబౌలి ఎస్ఐ జేవేంద్రనాయక్, బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ పాల్గొన్నారు. మహమ్మదాబాద్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

● జడ్చర్ల/నవాబ్‌పేట/బాలానగర్ : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. సంత్‌సేవాలాల్ మహారాజ్ చూని మార్గంలో నడుద్దామని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి పిలుపునిచ్చారు. జడ్చర్ల మండలం శంకరాయపల్లి సమీపంలోని బొంగురాలగుట్ట బంజారాభవన్‌లో నిర్వహించిన సేవాలాల్ జయంతిలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నవాబ్‌పేట, బాలానగర్ మండల కేంద్రాల్లో నిర్వహించిన సేవాలాల్ జయంతిలో ఎమ్మెల్యే పాల్గొని. మాట్లాడారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం భోగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా జడ్చర్ల పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి బొంగురాల గుట్ట బంజారాభవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి పాల్గొన్నారు.

● కోయిలకొండ : సేవాలాల్ ఆశయ సాధనలో భాగంగా గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి చేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు సేవాలాల్ లంబాడ దుస్తులు ధరించి నృత్యం చేశారు.

● పాలమూరు యూనివర్సిటీ : సంత్ సేవాలాల్ సేవలు మరువలేనివని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. పీయూ పరిపాలన భవనంలో ఎస్సీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప నివాళి అర్పించారు. కార్యక్రమంలో వీసీ వోఎస్డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవీందర్ పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సేవాలాల్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్ : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద తండాలో సేవాలాల్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బంజరా ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు సేవాలాల్ అన్నారు. సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు హర్యానాయక్, ఉపాధ్యక్షుడు రవి, కార్యదర్శి రామునాయక్ పాల్గొన్నారు.



జడ్చర్లలో నిర్వహించిన భోగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



అమ్మాపూర్ తండాలో సేవాలాల్ వేడుకల్లో పాల్గొన్న తహసీల్దార్ కిష్టానాయక్



సేవాలాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబంధం లేకుండా బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జానంపేట నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలు ఏ మాత్రం నిరాశకు గురికాకుండా స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ధైర్యంగా పోటీ పడటానికి సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా అమలు కానీ హమీలు ఇచ్చి ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి పూర్తి చేయకుండా గ్రామసభలు, అప్లికేషన్లు అంటూ కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగిసి ఏడాది కాలం గడిచినా ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకే శిలాఫలకాలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, కాంగ్రెస్ వచ్చాక కొత్తగా చేసిందేమీ లేదని ఆరోపించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహాయాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు బండ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళావతి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పల్లి శివరాములు, మాజీ సర్పంచులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నక్క ఆంజనేయులు, నాయకులు మదిన జమీర్, నక్క మల్లయ్యయాదవ్, నర్సింహులుగౌడ్, రవీందర్‌గౌడ్, ప్రకాశ్‌రెడ్డి, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిర్వాసితుల రిలే దీక్షలు

జడ్చర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పునరావాసం కల్పించి, పునరావాసం ప్యాకేజీని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉదండాపూర్ నిర్వాసితులు చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాల్గవ రోజు కొనసాగింది. పాలమూరు ఎత్తిపోతల పథకం, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయామని, గ్రామం సైతం ముంపునకు గురవుతుందని, సర్వం కోల్పోతున్న నిర్వాసితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని నిర్వాసితులు కోరారు. పునారావాసం ప్యాకేజీని రూ.25 లక్షలు ఇవ్వాలని, 18 సంవత్సరాల వయస్సు నిండిన వారిని తాజాగా లెక్కించాలని, పునరావాసం కల్పించే అంశంలో ప్లాట్లు, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థులకు కౌన్సెలింగ్



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2008 అభ్యర్థులకు ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా పది అభ్యర్థులు ఎంపికయ్యారు. శనివారం డీఈవో కార్యాలయంలో కౌన్సిలింగ్‌కు ఎనిమిది మంది అభ్యర్థులు హాజరుకాగా, వీరికి డీఈవో ప్రవీణ్ కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. మెరిట్ ఆధారంగా 8 మందికి పోస్టింగ్ ఇచ్చారు. తాత్కాలిక పద్ధతిన పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరంతా సోమవారం నుంచి పాఠశాలకు వెళ్లనున్నారు. అయితే వీరికి ఇచ్చిన పోస్టింగులు తాత్కాలిక పద్ధతిన కావడంతో విద్యాసంవత్సరం మొదటి రోజున నియమించి, చివరి రోజున తొలగిస్తారు. ప్రతీ ఏడాది ఇదే విధానం కొనసాగించనున్నారు. ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, సూపరింటెండెంట్ శంభుప్రసాద్, సీనియర్ అసిస్టెంట్స్ మధు, ప్రవీణ్‌కుమార్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మధన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, తపస్ అధ్యక్షుడు సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బాబునాయుడు, యూటీఎఫ్ అధ్యక్షుడు రవికుమార్, ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

విరాళం అందించేందుకు క్యూఆర్ కోడ్ సౌకర్యం



క్యూఆర్ స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో దీప్తిరెడ్డి

జడ్చర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలంలోని గంగాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయానికి సమర్పించే విరాళాలను క్యూఆర్ కోడ్‌తో చెల్లించే విధంగా నూతన సౌకర్యంను ఆలయ ఈవో దీప్తిరెడ్డి ఏర్పాటు చేయించారు. గ్రామంలోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు సౌజన్యంతో క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. క్యూఆర్ స్కానర్‌తో ఆలయానికి చెందిన బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని ఈవో దీప్తిరెడ్డి తెలిపారు. ఆలయ ట్రస్టీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ వీరేశ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం నసరుల్లాబాద్ పెద్దచెరువు తూమును అనుమతి లేకుండా తెరిచి నీటిని వాగులోకి వదిలిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, సీఐ కమలాకర్‌కు గ్రామస్థులు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో చెరువులో చేపలు పట్టుకునేందుకు వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్ వెంకటేశ్, నసరుల్లాబాద్‌కు చెందిన బాలస్వామి, రాఘవేందర్‌తో కలిసి తూమును తెరిచి చెరువులో ఉన్న నీళ్లను వదిలేసారని పేర్కొన్నారు. 500 ఎకరాల ఆయకట్టు ఉందని, నీళ్ల వదలడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాసయ్య, మల్లయ్య, పరశురాం, వెంకటయ్య, వెంకటరాములు, భీమయ్య, జంగయ్య, మల్లేష్ ఉన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అలవర్చుకోవాలి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నేటి కాలంలో అత్యాధునిక సాంకేతికతను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని కలం స్ఫూర్తి యాత్ర వ్యవస్థాపకుడు, యువ పారిశ్రామిక వేత్త మధులాష్ బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని 33 జిల్లాలో ఈ బస్సు ద్వారా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తామన్నారు. అర్చన, అజయ్‌రెడ్డి, దిలీప్, సాయి సుబ్రమణ్యం, రోహిత్, శ్రీధర్ పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

భూత్పూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మనలో ఏదైన సమస్యలు, తగాదాలు తలెత్తినా వాటిని తమ పరిధిలోనే ఇరువురు సమక్షంలో చర్చించుకుని రాజీమార్గంలో సమస్యలను పరిష్కరించుకోవాలని జడ్చర్ల జూనియర్ సివిల్ న్యాయాధికారి మహ్మద్ ముద్దాసీర్ అన్నారు. భూత్పూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయ వార్షికోత్సవ సమావేశంలో భాగంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

పీడీ చంద్రశేఖర్‌కు ఏషియన్ స్పోర్ట్స్ లీడర్‌షిప్ అవార్డు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన పీడీ చంద్రశేఖర్‌గౌడ్ ఏషియన్ స్పోర్ట్స్ లీడర్‌షిప్ అవార్డుకు ఎంపికైయ్యారు. ఇంటర్‌నేషనల్ కాన్ఫరేన్స్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిట్‌నెస్, స్పోర్ట్స్ సైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

20 లోపు అపార్ జనరేషన్ పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అపార్‌లో విద్యార్థుల వివరాలు 20 లోపు పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీఆర్పీలు, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు అపార్ నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం మొత్తం 270 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల వివరాలు ఆఫీస్‌లో నమోదు చేయాలన్నారు. మండలంలో 63,405 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పటి వరకు 17,080 మంది విద్యార్థుల వివరాలు మాత్రమే అపార్‌లో నమోదు కాగా, 46,325 మంది వివరాలు నమోదు చేయాలన్నారు. సీఆర్పీలు శ్రీనివాసులు, మొగులయ్య, గీతారాణి, ఖైసర్ జబీన్, వరలక్ష్మి పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన విద్యార్థులు



బొటానికల్ గార్డెన్ గురించి వివరిస్తున్న కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య

జడ్చర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను తెలంగాణ రాష్ట్ర సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల అండ్ కళాశాల రామిరెడ్డిగూడెం విద్యార్థులు శనివారం సందర్శించారు. బొటానికల్ గార్డెన్‌లో పెంచుతున్న అరుదైన, అంతరించిపోతున్న మొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలను గార్డెన్ కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య వివరించారు. అలాగే గార్డెన్‌కు అనుబంధంగా ఉన్న జీవవైవిధ్య పరిశోధన విద్యాకేంద్రం గురించి వివరించారు. కళాశాలలోని హెర్బేరియంలో భద్రపరిచిన మొక్కల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వాణిశ్రీ, టీచర్లు లలిత, సింధూర, శైలజ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రవీందర్, సాయిరాం, శివసాయి పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి యెన్నం ప్రసన్న లక్ష్మి, డైరెక్టర్ పూజిత మోహన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అన్ని దానాల కన్న రక్తదానం గొప్పదని, ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని న్యూరిషి ఉన్నత పాఠశాలలో పుల్వామాలో సైనికులపై జరిగిన సంఘటనలో అమర వీరులు సంస్మరణ సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని న్యాయవాది మనోహర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, ఎమ్మెల్యే సతీమణి యెన్నం లక్ష్మి ప్రసన్న, లయన్‌నటరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. పాఠశాల డైరెక్టర్ పూజిత మోహన్‌రెడ్డి, శిరీష ప్రవీణ్ కుమార్, సాయిసుశాంత్‌కృష్ణ, రెడ్‌క్రాస్ సభ్యులు డా.బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.